# అనసూయ

రామంకి రేపు ఉపనయనమట.—ఉపనయన మంటే ఏమిటే అమ్మా? అని అడిగింది ఆరేళ్ళ అనసూయ.

ఇంటికి ఒకటే "దీపం" అవడం మూలాన అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నారామెను, రాజ్యం, వేణుగోపాల రావులు.

పక్కింటి పరమేశంతో పదేళ్ళయి పరిచయం. పరమేశానికి పదేళ్ళ అబ్బాయి రామం వున్నాడు.

పనిలోవున్న తల్లి పైటపట్టుకుని అల్లా అడుగుతూన్న అనసూయవైపు తిరిగి, "ఉపనయనమంటే ఏమీ లేదమ్మా! మగవాడు పుస్తె కట్టుకోవడమే!" అని నవ్వుతో అంది పిల్లను సంతోషపెట్టేందుకు పరిహాసంగా.

పనిలోవున్న తల్లికి చికాకు కలుగుతుందని కాబోలు, కొంగును వదలేసి, ఛంగున పారిపోయింది పెరట్లోకి, పిడతలతో ఆడుకునేందుకై.

★

రెండిళ్ళ వాళ్ళకూ ఒకటే పెరడు—ఒకటే నుయ్యి.

పరమేశంగారి భార్య పార్వతమ్మ, పిండి విసురుతోంది,—ఉపనయానికి కాబోసు,

రామం ఇంట్లోని హడావిడి అంతా చూసి,—"రేపు ఏమిటమ్మా మన ఇంట్లో!"

"నిన్ను పీట్ల మీద కూర్చోపెడతారురా నాయనా!"

"పక్కన అన్సూ కూర్చోవచ్చా!"

"ఆ! రేపే! నీ పెళ్ళప్పుడు అది కూర్చుంటుంది లే!" అని సంతోషంతో అంది పార్వతమ్మ.

"పోమ్మా! నువ్వెప్పుడూ ఇంతే!" రామం పెరట్లోకి పారిపొయ్యాడు సిగ్గుతో.

★

రామాన్ని చూడ్డంతోనే అనసూయ పిడతలను వదిలేసి దగ్గరకు పోయి,—

"రామూ నీకు రేపు పెళ్ళట!" నవ్వుతో అంది.

"నాకు కాదు, నీకే....!" అతనూ సిగ్గుతో నవ్వాడు—ముఖం అటుతిప్పుకుంటూ.

"ఊ! పోనీలే! ఆడుకుందాం, దా" అంటూ రామం చేతిని,—పెళ్ళప్పుడు హోమం చుట్టూ తిరిగేందుకు పట్టుకున్నట్టు పట్టుకుని—పిడతల దగ్గరకు తీసుకుపోయింది.

★

ఊళ్ళోవాళ్ళల్లా రామం అనసూయలను చూసినప్పుడల్లా,—రాజ్యం పార్వతమ్మలతో—"ఎంత బావున్నారో! ఈడు, జోడూ,—కులం, గోత్రం,—అన్నీ సరిపొయ్యాయి! వీరిద్దరూ—" అని ఆశించేవారు.

రాజ్యం, పార్వతమ్మలు, ఎప్పుడూ తమపిల్లల పెళ్ళిళ్ళ గురించే ప్రసంగించుకునేవారు.

★

మరుదినం, రాజ్యం, పార్వతమ్మకు సహాయంగా వెళ్ళింది. విందుకువచ్చినవాళ్ళందరూ, రెండిళ్ళవాళ్ళనూ చూసి, "కాబోయే వియ్యంకులు! "అని హాస్యంచేశారు. రామం, అనసూయలను లోలోన దీవించారు.

★

కాలచక్రం అతివేగంగా తిరుగుతోంది. ప్రపంచానికి మరో పదేళ్ళునిండాయి.

## కృష్ణస్వామి

యౌవన సౌందర్య మాధుర్య సౌరభ్యంలో దివ్యంగా మెరసిపోతున్నారు. రామం అనసూయలు.

ఆ యౌవన పుష్పాలు ప్రేమతేనియల్ని ఒలుకుతున్నాయి!

★

వేసవి ఎండలు. స్కూలు సెలవలు.

సావిట్లో విస్తళ్ళు కుట్టుకుంటూ—మామూలుగానే—పెళ్ళిళ్ళ, పేరంటగురించి ప్రసంగించుకుంటున్నారు, రాజ్యం, పార్వతమ్మలు.

తల్లిదగ్గఱకు పోతున్నరామం,— "ఈడొచ్చింది. ఈ సెలవల్లోనే ముహూర్తం పెట్టే బావుండును," అని అనడం విని పెరట్లోకి పారిపొయ్యాడు, ఎందుచేతనో! పాపం!!

★

పెరట్లో సువర్ణలేఖ మామిడిచెట్టు. చెట్టునిండా చక్కని, ఎర్రటి పువ్వులతో నిండినట్టుంది.

ఛవ్వున చెట్టెక్కాడు రామం.

నీళ్ళకువచ్చిన అనసూయ, పళ్ళనుకోస్తున్న రామాన్నిచూసి "అన్నీ నీకే! నాకో రామూ!" నవ్వుతూ పైకిచూస్తో అంది—చిరపరిచయం చేత సిగ్గూ, బిడియంలేక.

"ఇదిగో—నీకు!" అంటూ ఐదుపళ్ళుక్రింద వేశాడు రామం.

"అదిగో,—ఆ చివరికొమ్మ చూడు! ఆ కొమ్మ చివరంట,—ఎంత ఎర్రగావుందో!" అని అనసూయ అంటూంటే,—అటు, ఆ పండువైపు ప్రాకాడు.

కల-కలమని శబ్దం!

కూ! అని కూసి ఎగిరిపోయింది కోయిల!

"అన్సూ!—"

"రామూ!—"

★

ఇరుగు పొరుగిళ్ళ ఆలోచనలు, ఆశలు పటాపంచలయినాయి. పాపం! ఒకే కొమ్మకు పూసిన రెండు పుష్పాల్లో ఒకటి ధూళిలో పడిపోయింది. పడిపోయిన పుష్పాన్నిచూసి ప్రేమాశ్రువుల్ని రాల్చింది కొమ్మమీద ఒంటరిగావున్న పుష్పం.

★

రామం ఇపుడు హాస్పటల్లో వున్నాడు. డాక్టరు, రామానికి ఓ కాలును తీసేశాడు. ఆరునెల్లిగ్గాని ఆస్పత్రిని వదిలేటందుకు వీలులేదు రామం. ప్రతీ సాయంత్రం పార్వతమ్మ రామాన్ని చూసేందికి ఆస్పత్రికి వెళ్ళుతోంది.

★

"అయితే, పిల్లకెప్పుడు పెళ్ళి!" అడిగాడు వేణుగోపాలరావు తన భార్యని ఓనాడు రాత్రి.

"రామంకి ఎప్పుడు బాగైతే అప్పుడు!" అంది ఆ ఇల్లాలు.

"ఇంకా రామానికి అనుకుంటున్నావ్! కాలు లేదు!—పిత్రార్జితం లేదు! బాగా అనుభవిస్తుంది లే పిల్ల!" ఎగతాళి చేస్తూఅన్నాడు.

"అయితే ఏమంటారు ఇప్పుడు? వేరే సంబంధం చూస్తారాఏం కొంపదీసి! ఊళ్ళో వాళ్ళంతా ఉమ్మిపొయ్యరూ! బాగానే వుంది!"

"బాగానే వుంది! నువ్వూ, నీ మాటలూ. మన పిల్ల బాగోగులు ఊళ్ళో వాళ్ళకేం కావాలి! నువ్వు ఊరుకో! ఈ నెల్లోనే మంచి సంబంధం చూస్తా!" ఓ రైల్వే నవల్ని విప్పుతో అటు తిరిగి పొయ్యాడు.

పాపం! ఆ ఇల్లాలు ఏమంటుంది?

★

బెజవాడలో వరుణ్ణి వేగిరమే కుదిర్చాడు వేణుగోపాలరావు,

పెళ్ళి చూపుల కొచ్చాడు, పాతికేళ్ళ అబ్బాయి.

"అనసూయా! కాఫీ పట్టుకొరా అమ్మా!" చావిట్లోంచి అరిచాడు వేణుగోపాల్.

తండ్రి కోపగిస్తాడేమో అన్న భయంచేతనూ, తల్లి ప్రేరేపింపులచేతనూ, రెండు కప్పుల కాఫీని తీసుకువెళ్ళింది అనసూయ. బల్లమీద వాట్ని వుంచేసి ఛప్పున వచ్చేసింది.

"చిట్టీ! చూడమ్మా! ఇటు చూడు! అతడే,—ఆ అబ్బాయే!—అంటూ కన్నీళ్ళతో నవ్వింది రాజ్యం. అనసూయను దగ్గరకు తీసుకుంటూ.

ఆమె కన్నీళ్ళు. అనసూయ నుదుటి కుంకుమని కడిగేశాయి.

తల్లివైపు చూస్తూ, "ఏందుకేడుస్తున్నావమ్మా! అంటూంటే. ఆమె కలత చెందింది. కుంకుమపెట్టెను తొందరగాతీసి, ప్రేమతో కుంకుమ పెట్టి,—"ఏమీలేదమ్మా! వాళ్ళ రామాని కెల్లావుందో. పాపం!" అని అంటూ, కన్నీటిని కొంగుతో తుడిచేసుకుంది.

"అవును. పాపం!" అంతకంటె, ఆమె ఏం చేయగలదు?

★

రామం తనతల్లిని ప్రతిదినం అనసూయను గురించి అడగడం, ఆమె ఆ ప్రసంగాన్ని తప్పించడం, జరుగుతోంది.

"అనసూయను గురించి ఎప్పుడడిగినా చెప్పవేమ్మా! నువ్విప్పుడు చెపుతేగాని, దీన్ని తాగను" అంటూ పాలగ్లాసుని బల్లమీద వుంచేశాడు రామం.

భగ్నస్వరంతో పార్వతమ్మ, "తాగునాయనా తాగు,—తరువాత చెపుతాలే!"

"చెప్తావునుమీ! లేకపోతే!—" అని పాలని తాగేసి, "ఊఁ! ఇపుడు చెప్పు!"

"ఏమిటి చెప్పను బాబూ! ఇవేళ రాత్రిఏడుగంటల బండిలో బెజవాడ,—వాళ్ళ అత్తవారింటికి—పోతుంది....మనల్ని మఱచిపోయారు వాళ్ళు....!" అని కన్నీటిని కాల్వలుగా కార్చింది పార్వతమ్మ!

"ఏడుస్తావెందుకమ్మా!"

★

ఆస్పత్రి. అంతా నిశ్శబ్దం—ఒకరిద్దరిదగ్గులూ, మూల్గులూ తప్ప—

రెండు ఊతకఱ్ఱలతో అటూ చూస్తూలేచాడు, రామం! గోడనున్నగడియారం 6½ చూపుతూ, 'ఠంగ్'మనికొట్టింది. ఎందుచేతనో!

★

సప్తమి చంద్రుడు చెట్లలో ఆడుతున్నాడు. "గుప్‌గుప్"మంటూ మెయిల్‌వచ్చి, ఆయాసంతో ఆగింది. తలమీదా, రెండుచేతుల్లోనూ, సామాన్లతో ఓ పోర్టర్—నవనాగరకుడైన యువకుడొకడూ,—అతనివెంట నైనుపంచ కట్టుకున్న ఆవిడా,—వారివెనుక అనసూయ, రాజ్యం! సప్తమినాటి వెన్నెలకు అనసూయ కళ్ళల్లోని 'నీళ్ళు' తళతళ మెరిశాయి.

అందరూ బండెక్కారు, రాజ్యం తప్ప.

"చాలా చిన్న పిల్ల! బెంగపెట్టుకోకుండా చూడండి! ఏం!" అంటూ కొంగుతో కన్నీళ్ళను తుడుచుకుంది రాజ్యం.

"ఏమిటమ్మా! మేముమాత్రం, పిల్లల్ని కనుక్కోలేదా, ఏం!?" అంటూ పరుపు మీద కూర్చుంది, నైనుపంచ.

★

గార్డు, ఈల ఊదాడు. పచ్చజెండా ఊపేడు. బండి 'కూ' అని కూసి కదలింది,—అతి కష్టంతో.

"అన్నూ!—అ—న్నూ"

కిటికీలోంచి తొంగిచూసింది అనసూయ. ప్లాట్‌పారం చివర, కఱ్ఱలుపట్టుకునిందున్న కుంటి రామాన్ని చూడగానే,—మామిడిచెట్లూ. పళ్ళు కొయ్యడం,—కొమ్మ విరగడం,— కేకవేయడం, కోయిల 'కూ' అని కూయడం అన్నీ ఒక్కసారిగ అనసూయ మనోవీధిలో పరుగులుతీశాయి.

కన్నీళ్ళతో పడిపోయిన రామాన్ని చూస్తూ, ఏమీచెయ్యలేక బాధపడ్తోన్న అనసూయను—ఇంజెన్ కూ" అని కేకవెయ్యగానే; వళ్ళు ఝల్లుమంది.

పాడురైలు, రామం ప్రేమనీ, ప్రాణాన్నీ, తీసుకుపోతోంది/ ఎవరాపగలరు?....?....?

జాలిగ చూసింది జాబిల్లి, మరి లేవలేని రామాన్ని.

★

సునాయాసంగా బండిగోదావరి దాటుతోంది. 'గుష్, గోష్'మని శబ్దంచేస్తోంది, గోదావరి సముద్రంలాగ. కారుమేఘాలు కమ్ముకుంటున్నాయి ఆకాశదీపాల్ని ఆర్పేస్తూ. గోదావరి గీతానికి సృతులుగ ఉరుముతున్నై.

అత్తా, భర్తా, మెత్తని పరుపులమీద పరున్నారు, గుఱ్ఱు కొట్టూ.

అనసూయమనస్సులో ఆందోళన. ఆవేదన, అల్లకల్లోలం, హాస్యం, అన్నీ పొంగి పొర్లుతున్నాయి, అడుగున గోదావరిలో నీరులాగు.

ఆకాశాన మేఘాలు అరిచాయి.

★

ఢడాల్! ఢడాల్! మని తలుపు కోటిసార్లు కొట్టుకోవడంచేత కాబోలు కళ్ళుతెరిచాడు పెళ్ళికొడుకు.

"అనసూయా!" అని ఆందోళనతో కేకవేశాడు బిగ్గరగా.

దూరాన గోదావరి "గోష్! గోష్! గో! ఇదిగో!!" అని అరుస్తోంది.

మీద మేఘాలు అవును అని అట్టహాసం చేస్తొన్నై.

ప్రకృతిమాత కంటనీరెట్టుకుంది, పాపం!!